క్లుప్తంగా

ఎస్సైగా హరిత బాధ్యతల స్వీకరణ



ధర్మసాగర్(వేలేరు): వేలేరు ఎస్సైగా డి.హరిత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా పని చేసిన నవీన్‌కుమార్ మట్టెవాడ బదిలీ కాగా అర్బన్ మహిళా పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న హరిత ఇక్కడి స్టేషన్‌కు బదిలీపై వచ్చారు.

రెడ్డి సంఘం పట్టణ కమిటీ ఎన్నిక



కమలాపూర్: రెడ్డి సంఘం కమలాపూర్ పట్టణ అధ్యక్షుడిగా కట్కూరి తిరుపతిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలోని రెడ్డి సంఘం భవనంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం సంఘం నాయకులు సమావేశమై నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా పల్లె కరుణాకర్ రెడ్డి, కార్యదర్శిగా కట్కూరి జయపాల్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా కట్కూరి వెంకట్రాంరెడ్డి, కోశాధికారిగా కట్కూరి చంద్రారెడ్డి, డైరెక్టర్లుగా ఎండపెల్లి తిరుపతిరెడ్డి, పల్లె కొమురారెడ్డి, చంద్రారెడ్డి, చల్లా సుధాకర్‌రెడ్డి ఎన్నికయ్యారు.

ఆరె సంక్షేమ సంఘం కమిటీ ఎన్నిక



కమలాపూర్: మండలంలోని వంగిడిపల్లిలో ఆరె సంక్షేమ సంఘం గ్రామ కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం మండల అధ్యక్షుడు కదం రాములు తెలిపారు. అధ్యక్షుడిగా బాస్పాటి వీరేశం, ఉపాధ్యక్షుడిగా అంబిరె సాంబయ్య, ప్రధాన కార్యదర్శిగా బాస్పాటి కృష్ణ, ప్రచార కార్యదర్శిగా లకిడె శ్రీనివాస్, కోశాధికారిగా చేలికె రాజేష్, కుల పెద్దమనిషిగా బాలపురి కనుకరత్నం, సలహాదారుగా ఆముదాపురం రమేష్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చేలికె శ్రీనివాస్, ఎంపీటీసీ గుబిరె సుగుణాకర్‌రావు, రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులు వలిగె సాంబరావు, చందర్‌రావు, రామారావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

పరిహారం అందించాలి

నడికూడ: గత ఏడాది వడగండ్ల వర్షానికి దెబ్బతిన్న పంటలకు నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని తెలంగాణ బీసీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వరికెల కిషన్‌రావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మంత్రులు పర్యటించి వర్షానికి దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం అందిస్తామని హామీ ఇచ్చిన ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదన్నారు. ముఖ్యమంత్రి జిల్లా పర్యటన నేపథ్యంలో మరోసారి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి ఎంతో కొంత నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కిషన్‌రావు కోరారు.

ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు తగదు

ఐనవోలు: పాత పెన్షన్ సాధనలో పాల్గొనే ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామనే కేంద్రం చర్యలను ఖండిస్తున్నామని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి, మీడియా కన్వీనర్ చుంచుకాల లింగారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ సిబ్బంది, శిక్షణా విభాగం ఆదేశాలు ఇవ్వడాన్ని, పైగా ఆ ఆదేశాలను అతిక్రమిస్తే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించడం అప్రజాస్వామికమన్నారు. కేంద్రం బెదిరింపు చర్యలకు పాల్గొనకుండా కేంద్ర ఉద్యోగ ఉపాధ్యాయులందరికీ పాతపెన్షన్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

పాఠశాలల బలోపేతమే లక్ష్యం



దామెర: ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు పోలం కృపాకర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో జరుగుతున్న మన ఊరు–మన బడి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాల ప్రహరీ, కిచన్‌షెడ్ నిర్మాణం కోసం ఈజీఎస్ నుంచి రూ.37. 60 లక్షలు, టాలెట్ల నిర్మాణం, డైనింగ్ హాల్, మేజర్, మైనర్ రిపేర్లు, ఎలక్ట్రికల్ పనుల కోసం మరో రూ.23.70 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. పనులు చివరి దశలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట ఎస్‌ఎంసీ చైర్మన్ గోనెల సురేష్, తదితరులు ఉన్నారు.

ఎల్కతుర్తి: పంచాగశ్రవణంలో పాల్గొన్న గ్రామస్తులు



శాయంపేటలో..



కమలాపూర్‌లో..



ఘనంగా ఉగాది వేడుకలు



ధర్మసాగర్ : పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు వినయ్‌శర్మ

ఎల్కతుర్తి : శ్రీ శోభకృత్ నామ సంవత్సరం ఉగాది వేడుకలను ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండల ప్రజలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. పండుగ సందర్భంగా ఒగరు, తీపి, పులుపు, చేదుతో కూడిన ఉగాది పచ్చడి, ప్రీతి వంటకమైన బక్ష్యాలను ఆరగించిన ప్రజలు సాయంత్రం వేళ సమీప దేవాలయాల వద్దకు చేరుకున్నారు. ఆలయ అర్చకులు పంచాంగ శ్రవణాన్ని చదివి వినిపించారు. శివాలయ అర్చకులు నందనం రవిశర్మ, మణిశ ర్మ, రోహిత్ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శాయంపేట : మండల కేంద్రంలోని అతిపూరాతనమైన శ్రీ మత్స్యగిరి స్వామి దేవాలయంలో ఉగాది సందర్భంగా బుధవారం అర్చకులు ఆరుట్ల కృష్ణమాచారి పంచాంగ శ్రవణం చేశారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ సామల భిక్షపతి, సర్పంచ్ కందగట్ల రవి, గ్రామ పెద్దలు జిన్నా ప్రతాప్ సేన రెడ్డి, వినుకొండ శంకరాచారీ పాల్గొన్నారు.

కమలాపూర్: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో శ్రీ శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమాల్లో విజన్ ట్యూటోరియల్స్, కోచింగ్ సెంటర్ నిర్వాహకులు జక్కు భిక్షపతి, ఉపాధ్యాయురాలు జక్కు పద్మ, తదితరులు పాల్గొన్నారు.

ధర్మసాగర్(వేలేరు): ధర్మసాగర్, వేలేరు మండలాల్లోని వివిధ గ్రామాల్లో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక పూ జ లు చేసి పంచాంగ శ్రవణం చదివి వినిపించారు. కా ర్యక్రమంలో జెడ్పీటీసీ చాడ సరిత, సర్పంచ్ గోదల రాజిరెడ్డి, ఎంపీటీసీ బాల్నె వెంకటేశ్వర్లు , ఆలయ చైర్మన్ రవి, ఉప సర్పంచ్ సురేష్, ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నడికూడ: మండలంలోని ఊరూరా పంచాంగ శ్రవణం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: మండలంలో ఉగాది వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో ప్రముఖులు, ప్రజాప్రతినిధులు. శ్రీవేణుగోపాలస్వామి భజనమండలి సభ్యులు పాల్గొన్నారు.

దామెర: మండల కేంద్రంతో పాటు పలు గ్రామల్లో శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఆంజనేయ స్వామి ఆలయంలో అర్చకులు గమ్మడవెల్లి సుబ్బయ్య శర్మ నిర్వహించిన పంచాంగ శ్రవణం కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు పోలం కృపాకర్‌రెడ్డి, సర్పంచ్ గురిజాల శ్రీరాంరెడ్డి, దళిత బంద్ చైర్మన్ గరిగె క్రిష్ణమూర్తి, మాజీ పీపీ గంగిడి శ్రీధర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ రతన్‌కుమార్ పాల్గొన్నారు.

పరకాల: పట్టణంలోని శ్రీకుంకుమేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీశోభకృత్ నామ సంవత్సరం వేడుకలు బుధవారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఆలయ ఆవరణలో బ్రహ్మశ్రీ కోమాళ్లపల్లి సంపత్‌కుమార్ శర్మ పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మొ లుగూరి భిక్షపతి, మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ బండి సారంగపాణి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి, ఆలయ ధర్మకర్తలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



నడికూడ : హనుమాన్ ఆలయంలో..



ఆత్మకూరు: పంచాంగశ్రవణం చదువుతున్న అర్చకులు



దామెర : పంచాంగ శ్రవణంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు



పరకాల : పంచాంగ శ్రవణం చేస్తున్న సంపత్‌కుమార్ శర్మ

ఆలయ ముఖ్య అర్చకుడికి సన్మానం



మధుకర్ శర్మను సన్మానిస్తున్న మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, మల్లారెడ్డి

ఐనవోలు: స్థానిక శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో ముఖ్య అర్చకుడిగా విధులు నిర్వహిస్తున్న ఐనవోలు మధుకర్ శర్మను దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి, టీఎస్ఐడీసీ చైర్మన్ వేణు గోపాలాచారి, ఎండోమెంట్ కమిషనర్ అనిల్‌కుమార్ సన్మానించారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో రాష్ట్రంలోని పలు దేవాలయాల్లో విధులు నిర్వహిస్తున్న అర్చకులను సన్మానించారు. అందులో భాగంగా బుధవారం మధుకర్‌శర్మను శాలువాతో సత్కరించి పారితోషికం అందజేసినట్లు ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు. మధుకర్ శర్మను ఆలయ అర్చకులు, ఉద్యోగ సిబ్బంది అభినందించారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్



ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలంలోని వంగర శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. ఇల్లందుల కుమారస్వామి, డప్పు రవిలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ ఒకటి, రెండు సార్లు పట్టుబడితే కేసులు నమోదు చేస్తామని, మూడోసారి పట్టుబడితే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. అలాగే ట్రాక్టర్‌కు నంబర్, డ్రైవర్‌కు లై సెన్స్ లేకుండా నడిపితే బండ్లు సీజ్ చేయడంతో పాటు డ్రైవర్‌పై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా సరే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆటో, బైక్ ఢీ.. ఇద్దరికి గాయాలు

నడికూడ: ఆటో, బైక్ ఢీకొనడంతో ఇద్దరు యువకులకు గాయాలైన సంఘటన మండల కేంద్రంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన గోర్ల నాగరాజు, ఎస్.లెనిన్ వర్మ బైక్ పై ఇంటి నుంచి బస్టాండ్ వైపు వస్తున్నారు. బస్టాండ్ నుంచి గ్రామంలోకి వస్తున్న ఆటో హైస్కూల్ వద్ద బైక్‌ను ఢీ కొనడంతో బైక్ పై ఉన్న నాగరాజుకు, లెనిన్‌కు తీవ్రగాయాలయ్యా యి. స్థానికులు చికిత్స కోసం అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

ప్రతిష్ఠ కార్యక్రమాలను విజయవంతం చేయాలి

ఆత్మకూరు: మండలంలోని గుడెప్పాడ్‌లో శ్రీసీతా రామచంద్ర లక్ష్మణసహిత ఆంజనేయ మూలమూర్తుల గరుడస్తంభ దేవాలయ ప్రతిష్ఠ మహోత్సవాలు విజయవంతం చేయాలని అర్చకులు ఆరుట్ల కేశవమూర్తి కోరారు. యాజ్ఞికులు బీట్కూరి విజయ సారథి ఆచార్యులు, అర్చకుల మంత్రోచ్ఛరణల మధ్య బుధవారం రాత్రి ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు ఈనెల 24 వరకు కొనసాగుతాయని ఆయన తెలిపారు.

మానవ విలువలను కాపాడుకోవాలి



విద్యార్థికి ప్రశంసపత్రం అందజేస్తున్న కుడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, తదితరులు

హన్మకొండ / హన్మకొండ అర్బన్: విద్యార్థులకు చదువుతోపాటు మానవ విలువలు కూడా పెంపొందించాలని కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజు యాదవ్, వరంగల్ వెస్ట్ జోన్ డీసీపీ ఎండీ.బారి సూచించారు. హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో బాలసముద్రంలోని శ్రీనివాస గురుకుల్ పాఠశాల వార్షికోత్సవ వేడుకలు మంగళవారం రాత్రి జరిగాయి. ముఖ్య అతిథులుగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని ఎంచుకుని ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగితే విజయం సాధించవచ్చని వివరించారు. విద్యార్థులు మొబైల్ ఫోన్స్, టీవీలకు దూరంగా ఉంటూ పుస్తకాల్లోని జ్ఞానాన్ని గ్రహించాలని సూచించారు. అనంతరం జాతీయ గణిత ఒలింపియాడ్ విజేతలు, రాష్ట్రస్థాయి ర్యాంకులు, క్రీడా విభాగంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సోమరత్నం, డైరెక్టర్ శ్రీనివాస్, వడుప్సా జిల్లా అధ్యక్షుడు ఎం.సతీష్ కుమార్, ప్రెస్ క్లబ్ మాజీ ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

ఆదాయపన్ను చెల్లింపుదారులకు అండగా..

వరంగల్: ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు చట్టపరంగా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని సీఐఆర్‌సీ (ఐసీఏఐ) వరంగల్ బ్రాంచ్ చైర్మన్ రాయబారపు హరికృష్ణ అన్నారు. ఆదాయ పన్ను నోటీసులు, టీడీఎస్‌ల చెల్లింపులపై ఈనెల 24వ తేదీన హంటర్‌రోడ్డులోని ఐసీఏఐ భవన్‌లో నిర్వహిస్తున్న అవగాహన సదస్సుకు సంబంధించిన కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాణిజ్య, వ్యాపార వర్గాలు, పన్ను చెల్లింపుదారులు అధిక సంఖ్యలో పాల్గొని వారి సందేహాలను నివృత్తి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ సీఏ భగవన్‌దాస్ ముందడ, కార్యదర్శి సీఏ సత్యనారాయణ పూజారి, కోశాధికారి సీఏ రామకృష్ణ పాల్గొన్నారు.

గాయత్రినగర్ కాలనీ కమిటీ ఎన్నిక



హన్మకొండ అర్బన్: గాయత్రినగర్ కాలనీ కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.అశోక్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా జి.కొమురయ్య, ఉపాధ్యక్షుడిగా జి.జగపతిరావు, కోశాధికారిగా పి.కిషన్, కార్యవర్గ సభ్యులుగా కె.శ్రీకాంత్, ఎస్.సారయ్య, పరశురాములు, సతీష్, జి.రవీందర్, బి.లవకుమార్, ఈ.తిలక్ రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భగా వారిని పలువురు అభినందించారు.

డిపోకు నష్టం రాకుండా కాపాడుకుంటాం

● ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



ధర్నాలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులతో మాట్లాడుతున్న ఆర్టీసీ అధికారులు



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

పరకాల : పరకాల ఆర్టీసీ డిపోకు ఎలాంటి నష్టం కాకుండా కాపాడుకుంటామని స్థానిక ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి స్పష్టం చేశారు. గత కొంతకాలంగా డిపో ఆర్టీసీ బస్సులను తగ్గించటంపై బీఆర్ఎస్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. అంబేద్కర్ సెంటర్ కూడలిలో బీఆర్ఎస్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో రోడ్డుపై బైఠాయించారు. డిపోపై ఆర్టీసీ అధికారులు చేస్తున్న కుట్రలను మానుకోవాలంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఏసీపీ శివరామయ్యతో పాటు ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం కృపాకర్‌రెడ్డి, ఆర్టీసీ డీఎం బీఆర్ఎస్ నాయకుల ఆందోళన వద్దకు చేరుకొని శాంతింపజేశారు. ఆందోళన అనంతరం ఆర్టీసీ అధికారులతో కలిసి ఎమ్మెల్యే ధర్మారెడ్డి మీడియాతో మాట్లాడుతూ డిపోను ఎత్తివేస్తున్నట్లు వస్తున్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదన్నారు. ఇతర డిపోల నుంచి పరకాల ఆర్టీసీకి ఎలాంటి నష్టం జరిగినా ఊరుకునే ప్రసక్తేలేదని అధికారులకు స్పష్టం చేసిన ఆయన డిపోకు మరిన్ని కొత్తబస్సులు తీసుకరావాలని కోరారు. ఆదాయం లేని మార్గాల్లో కొన్ని బస్సులను నిలిపివేసిన మాట నిజమేనని అన్నారు. నష్టాల బాటలో ఉండే డిపోను లాభాల బాటలోకి వెళ్లేందుకు అధికారులు, కార్మికులు ఎంతగానో శ్రమించడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే సూచనల మేరకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కొత్త బస్సులు, రద్దీగా ఉండే రూట్లలో అదనపు సర్వీసులు ఏర్పాటు చేస్తామని ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం కృపాకర్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ, వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ బండి సారంగపాణి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మడికొండ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో పోటెత్తిన జాతర



గుట్టపైకి వెళ్తున్న భక్తులు

ఎల్కతుర్తి: మండలంలోని దామెరలో ప్రతీ ఉగాది పర్వదినం రోజున కులమతాలకతీతంగా జరిగే ఫకీర్ షావలి జాతరకు భక్తులు బుధవారం పోటెత్తారు. జాతరలో కేవలం ముస్లీంలే కాకుండా హిందువులు అధిక సంఖ్యలో పాల్గొని ఫకీర్ షావలి సమాధిని దర్శించుకున్నారు. సమాధి వద్దకు చేరుకోవడానికి సుమారు 200 అడుగుల ఎత్తులో ఉన్న గుట్టను తాడు సాయంతో ఎక్కాల్సి ఉంటుంది. అయినప్పటికీ పిల్లలు, పెద్దలు తేడా లేకుండా ఫకీర్ షావలిని దర్శించుకున్నారు. భక్తులు జెండాలు పట్టుకొని ఫకీర్ షావలిని తలుస్తూ గుట్టపైకి చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ముజావర్లు రెండు రోజుల నుంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం సర్పంచ్ చల్లా రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు అన్ని వసతులు ఏర్పాటు చేశారు. పోలీసులు జాతరలో భారీ బందోబస్తు నిర్వహించారు.

నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ అండ



బాధిత కుటుంబ సభ్యులకు ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే అరూరి రమేష్

ఐనవోలు: ఆరోగ్యశ్రీలో వర్తించని వ్యాధులు, ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు సీఎం సహాయనిధి ఎంతో ఉపయుక్తంగా ఉందని ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. మండలంలోని పంథినికి చెందిన చిర్ర రాజుకు రూ.2.5 లక్షల ఎల్‌ఓసీని హన్మకొండలోని తననివాసంలో బుధవారం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్య అవసరాల నిమిత్తం రూ.2.5 లక్షలు అవసరమని బాధితుడు సంప్రదించిన 24 గంటల్లో ఎల్‌ఓసీని అందజేసినట్లు తెలిపారు. పేద ప్రజల ఆరోగ్యానికి ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో పంథిని మాజీ సర్పంచ్ బరిగల సదానందం, బాధిత కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పురస్కారం అందుకున్న ధర్మప్రకాష్



అవార్డు అందుకుంటున్న ధర్మప్రకాష్

ధర్మసాగర్: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కేబీ ధర్మప్రకాష్ ఉగాది జాతీయ పురస్కారాన్ని అందుకున్నాడు. ఈ మేరకు ఎన్జీఓస్ నెట్‌వర్క్ సౌ జన్యంతో విశ్వశ్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఉగాది జాతీయ పురస్కారాలు అందజేశారు. సమావేశంలో కళాప్రపూర్ణ డాక్టర్ బిక్కి కృష్ణ, పాఠశాల విద్యా డిప్యూటీ డైరెక్టర్ గురుమూర్తి చేతుల మీదుగా బుధవారం ధర్మప్రకాష్ జాతీయ పురస్కారం అందుకున్నాడు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న వ్యక్తులకు అవార్డులు అందజేయగా, జనవిజ్ఞాన వేదికలో క్రియాశీల కార్యకర్తగా పనిచేస్తూ పర్యావరణ పరిరక్షణలో తన రచనలతో జన జాగృతం చేస్తున్న ధర్మప్రకాష్‌కు అవార్డు అందచేసినట్లు గురుమూర్తి తెలిపారు.

భారతీయ సంస్కృతిని పెంపొందించాలి



మాట్లాడుతున్న చీఫ్ విప్ వినయ్‌భాస్కర్

హన్మకొండ: భారతీయ సంస్కృతిని పెంపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ సూచించారు. హనుమకొండ నక్కలగుట్టలో ప్రవాసీ రెడ్డి పేరెంట్స్ అసోసియేషన్ ప్రథమ వార్షికోత్సవం, ఉగాది వేడుకలు బుధవారం జరిగాయి. ముందుగా పురోహితుడు పంచాంగ శ్రవణం చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో చీఫ్‌విప్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి చాలా గొప్పదని విరించారు. తమ సంస్కృతిని ప్రవాసీ అసోసియేషన్లు విశ్వవ్యాప్తం చేయాలని కోరారు. ప్రవాసీ రెడ్డి పేరెంట్స్ అసోసియేషన్‌కు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ తానా సభలకు అమెరికా వెళ్లినప్పుడు తనను ఎంతో ఆప్యాయంగా చూసుకున్నారని గుర్తుచేశారు. ప్రవాసీ రెడ్డి పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అంజీవర్ధన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జనగామ జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, నేతాని శ్రీనివాస్‌రెడ్డి, బీరవెల్లి భరత్ కుమార్‌రెడ్డి, రెంటాల కేశవరెడ్డి, ఉష, అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి స్టీల్ ఆర్చీ బహూకరణ

మడికొండ: గ్రేటర్ వరంగల్ పరిధిలోని 46వ డివిజన్ మడికొండ ఎస్సీ కాలనీలోని అభయాంజనేయస్వామి ఆలయానికి స్టీల్ ఆర్చిని వస్కుల నర్సయ్య – లక్ష్మి దంపతులు, కుటుంబ సభ్యులు సంగీత్, మమత బుధవారం బహూకరించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు బొల్లికొండ వినోద్, గాండ్ల భిక్షపతి, వస్కుల దేవేందర్, రాసమల్ల వెంకటస్వామి, నమిండ్ల ప్రభాకర్, వస్కుల శివ, భాస్కర్, నాగరాజు, రమేష్, పాల్గొన్నారు.